మహబూబ్‌నగర్ వార్త



నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగుళాంబ గద్వాల / నారాయణపేట



వాల్మీకి జయంతి వేడుకల్లో కలెక్టర్ సిక్తా పట్నాయక్

## ఆదర్శప్రాయుడు వాల్మీకి మహర్షి

### నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

**నారాయణపేట, అక్టోబరు 7 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లాలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తదుపరి మాట్లాడుతూ రత్నాకరుడి నుంచి వాల్మీకిగా ఆయన పరివర్తన మనుష్యుని ఆత్మపరిశీలన కృషి జ్ఞానం ఎంతటి శక్తివంతమైన మార్పు తీసుకురాగలదో నిరూపించిందని అన్నారు. వాల్మీకి రచించిన రామాయణం ప్రపంచ సాహిత్యంలో మహత్తర గ్రంథమని ఆయనను సంస్కృత సాహిత్యంలో ఆదికవిగా గుర్తిస్తారన్నారు ఆయన జీవితం మనందరికీ స్ఫూర్తిదాయకమని కృషి ఉంటే మనిషి ఋషిగా మారగలడని పేర్కొన్నారు. వాల్మీకి బోధనలు సమాజంలో ధర్మం సత్యం కరుణ విలువలను నాటాయని తెలిపారు. సమాజం ఆయన చూపిన మార్గంలో నడిస్తే సమానత్వం శాంతి నెలకొంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సంచిత్ గంగ్వర్, శ్రీను, ఎస్‌డీసీ రాజేందర్ గౌడ్, డిప్యూటీ కలెక్టర్ శ్రీరామ్ ప్రణీత్ పాల్గొన్నారు. అలాగే ఏవో జయసుధ, బీసీ సంక్షేమ అధికారి ఖలీల్, డీపీఆర్వో ఎంఏ రషీద్, సీపీవో యోగానంద్ తదితరులు హాజరయ్యారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిఎస్పీ వెంకటేశ్వర్లు

## గంజాయి ముఠా వివరాలు వెల్లడించిన డీఎస్పీ

**వనపర్తి (పెబ్బేరు) అక్టోబరు 7 ప్రభాతవార్త:** పట్టణంలో సోమవారం దొరికిన గంజాయి ముఠా వివరాలను పేబ్బేరు పోలీస్ స్టేషన్ నందు మంగళవారం పత్రిక సమావేశంలో డిఎస్పీ వెంకటేశ్వర్లు వివరాలు వెల్లడించారు. మల్లేష్ ప్రభు అనే వ్యక్తి బెంగళూరులో ట్రావెల్స్ బస్సు డ్రైవర్‌గా పనిచేసే వాడని అతనితో సహా డ్రైవర్‌గా దిలీప్ కాలే అనే వ్యక్తి పరిచయమయ్యాడు. దిలీప్ కాలే, రెండు సంవత్సరాలుగా మోహన్, అర్జున్ వ్యక్తుల వద్ద ఒడిస్సా నుండి గంజాయి కొనుగోలు చేసి, చిన్న చిన్న ప్యాకెట్లుగా అమ్మి లాభాలు పొందు తున్నాడని తెలిపాడు. దిలీప్ కాలే ఈ వ్యాపారం చేయమని మల్లేష్ ప్రభుకు సూచించగా, అప్పులలో ఉన్న మల్లేష్ ప్రభు అంగీకరించాడు. ఆ తరువాత ఇద్దరూ కలిసి ఒడిశా నుండి గంజా కొనుగోలు చేసి, బెంగళూరులో అవసరం ఉన్న వారికి చిన్న చిన్న ప్యాకెట్లుగా చేసి అమ్ముతూ సులభంగా డబ్బులు సంపాదించడం మొదలు – మిగతా4లో..

## ఇందిరమ్మ ఇండ్ల పనులను పరిశీలించిన కలెక్టర్



ఇందిరమ్మ ఇళ్ల లబ్ది దారులతో మాట్లాడుతున్న కలెక్టర్

**గద్వాలటౌన్,అక్టోబర్ 7, ప్రభాతవార్త:** గద్వాల్ మున్సిపాలిటీ పరిధిలోని గంజిపేట వార్డు నెంబర్ 14లో నిర్మాణంలో ఉన్న ఇండ్లపనులను మంగళవారం కలెక్టర్ బియం సంతోష్ పరిశీలించిన అనంతరం ఇండ్లు నిర్మాణ పనుల్లో నాణ్యతపై ఏమాత్రం రాజీ పడకుండా,ప్రతిదశలో పనులు వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు.నిర్మాణం కోసం అవసరమైన ఇసుక, మట్టినిలబ్ధిదారులకు అందజేయాలన్నారు.మున్సిపల్ స్థాయిలో మార్క్ అవుట్, బేస్‌మెంట్ స్థాయి పనులు వేగంగా పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్‌కు ఆదేశించారు.నిర్మాణపు పనులు త్వరగా పూర్తయ్యేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. అధికారులు పూర్తయిన పనుల ఫోటోలను వెంటనే క్యాప్చర్ చేయాలని,లబ్ధిదారులకు వెంటనే వారిఖాతాలో డబ్బులు జమ అయ్యేలా చూడాలన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జానకి రామ్,సిబ్బంది, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి

### ఎలాంటి పొరపాట్లకు తావివ్వద్దు

### మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేంద్ర బోయి

### స్థానిక సంస్థల ఎన్నికలపై శిక్షణా కార్యక్రమం



హాజరైన అధికారులు

మాట్లాడుతున్న కలెక్టర్ విజయేంద్ర బోయి

**మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబరు 7 ప్రభాత వార్త:** స్థానిక సంస్థల ఎన్నికలను ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి తెలిపారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల కొరకు ప్రిసైడింగ్ అధికారుల శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలు సజావుగా నిర్వహించుటలో అధికారుల విధులు చాలా కీలకమని, చిన్న పొరపాటుకు అవకాశం ఇవ్వొద్దని సూచించారు. ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా ఎన్నికలను పకడ్బందీగా, ప్రశాంతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఎన్నికల నిర్వహణలో రాష్ట్ర ఎన్నికల సంఘం జారీచేసిన నిబంధనలు, మార్గదర్శకాలపై సమగ్రమైన అవగాహన కలిగి వుండాలని సూచించారు. ఎన్నికల విధులు చాలా కీలకమని, చిన్న పొరపాటుకు తావులేకుండా పకడ్బందీగా నిర్వహించుటకై అధికారులు కార్యోన్ముఖులు కావాలని స్పష్టం చేశారు. ఎన్నికల విధులు నిర్వహణలో నిరక్ష్యం వహిస్తే ఎన్నికల సంఘం నిబంధనల మేరకు కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని, కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వహించాలని ఆమె స్పష్టం చేశారు. ఎన్నికల విధులు నిర్వహణపై హ్యాండ్ బుక్‌లోని ప్రతి అంశంపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఏదేని సందేహాలు ఉంటే శిక్షణా కార్యక్రమంలో నివృత్తి చేసుకోవాలని సూచించారు. మాస్టర్ ట్రైనర్స్ ఎన్నికల నిర్వహణ, ప్రిసైడింగ్ అధికారుల విధులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణ నిచ్చారు. ఈ కార్యక్రమంలో డిపిఒ పార్థసారథి, మాస్టర్ ట్రైనర్ బాలు యాదవ్, ఇతర ఎన్నికల శిక్షణ అధికారులు పాల్గొన్నారు.

## జడ్చర్ల కారు బీభత్సం

### 16 గొర్రెల మృత్యువాత

**జడ్చర్ల, అక్టోబరు7,ప్రభాతవార్త :** జడ్చర్ల మండల పరిధిలోని గొల్ల పల్లి సమీపంలో మంగళవారం సాయంత్రం రోడ్డు ప్రమాదం చోటు చేసుకున్నది. ధన్వాడ మండలం చెందిన యన్మన్‌పల్లికి చెందిన మహేష్ తన గొర్రెల మందను రోడ్డు ప్రక్కగా తరలిస్తుండగా హైదరాబాద్ నుంచి మహబూబ్నగర్ వైపు వెళ్తున్న కారు అదుపు తప్పి మందపైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో 16 గొర్రెలు మృతి చెందాయి ఈ ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

## ఖర్గేను కలిసి పరామర్శించిన ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి

**జడ్చర్ల, అక్టోబర్ 7, ప్రభాతవార్త :** అనారోగ్య కారణాలతో చికిత్స పొందిన ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ను మంగళవారం బెంగళూర్ లో కలిసి పరామర్శించిన జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి. మంగళవారం సాయంత్రం రాష్ట్ర మంత్రులతో కలిసి ఖర్గే ను ఆయన నివాసంలో కలిసిన అనిరుధ్ రెడ్డి ఖర్గే పూర్తిగా కోలుకోవాలని, సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని ఆకాంక్షించారు.



ఖర్గేను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

## బైపాస్‌కు లైన్ క్లియర్

- డీపీఆర్‌కు రంగం సిద్ధం
- ఈ బడ్జెట్‌లోనే జడ్చర్ల బైపాస్‌కు నిధులు..
- ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డికి లేక రాసిన నితిన్ గడ్కరీ
- ఫలించిన ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి కృషి
- హర్షం వ్యక్తం చేస్తున్న జడ్చర్ల వాసులు



నితిన్ గడ్కరీకి జడ్చర్ల బైపాస్ రోడ్డు ఆవశ్యకతను వివరిస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి, ఎంపీ అరుణమ్మ (ఫైల్)

**జడ్చర్ల,అక్టోబర్ 7, ప్రభాతవార్త :** జాతీయ రహదారి నెంబర్ 167 విస్తరణతో పాటుగా జడ్చర్ల బైపాస్ నిర్మాణాని డీపీఆర్ రూపొందించాల్సిందిగా కన్సల్టెన్సీకి ఆదేశించామని, వీటి నిర్మాణానికి అవసరమైన నిధులను ఈ ఏడాది బడ్జెట్ లోనే కేటాస్తామని కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖామంత్రి నితిన్ గడ్కరీ చెప్పారని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు గడ్కరీ తనకు లేఖ రాసారని వెల్లడించారు. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ గత మేనెల లో రాష్ట్ర పర్యటనకు వచ్చిన నేపథ్యంలో ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ, మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి తో పాటుగా షాద్ నగర్ ప్రాంతంలో ఆయనను కలిసి జడ్చర్ల బైపాస్ రోడ్డు నిర్మాణ ఆవశ్యకతను గురించి తెలిపి, జడ్చర్లకు బైపాస్ రోడ్డు మంజూరు చేయాలంటూ వినతి పత్రాన్ని కూడా సమర్పించిన విషయం తెలిసిందే. ఇటీవలే మరోసారి ఢిల్లీలో కూడా ఈ విషయంగా గడ్కరీతో కలిసి జడ్చర్ల బైపాస్ రోడ్డు గురించి చర్చించారు. ఈ సందర్భంగా జడ్చర్ల పట్టణం మీదుగానే హైదరాబాద్‌బెంగుళూరు జాతీయ రహదారి నెం. 44, రాయచూరు కోదాడ జాతీయ రహదారి నెం.167 పట్టణం మధ్యలో నుంచి వెళుతుండటంతో రోజూ వేల సంఖ్యలో వాహనాలు జడ్చర్ల గుండా రాకపోకలు సాగిస్తుండటంతో ట్రాఫిక్ తీవ్రంగా ఉంటుందని, దీనివల్ల ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలుగుతోందని గడ్కరీకి అనిరుధ్ రెడ్డి వివరించానని మంగళవారం మీడియాకు విడుదల చేసిన ఒక ప్రకటనలో అనిరుధ్ రెడ్డి గుర్తు చేసారు. దీనితోపాటుగా హైదరాబాద్ తర్వాత అంతటి స్థాయిలో పారిశ్రామికంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న జడ్చర్లకు బైపాస్ రోడ్డు అత్యవసరమని అందుకే వెంటనే బైపాస్ మంజూరు చేయాలని తాను కోరగా ఈ విషయంగా గడ్కరీ అప్పట్లోనే సానుకూలంగా స్పందించారని ప్రస్తావించారు. ఈ నేపథ్యంలోనే నితిన్ గడ్కరీ తనకు అధికారికంగా లేఖ రాసారని, అందులో 167 వ నెంబర్ జాతీర రహదారిని నాలుగు లైన్ల రహదారిగా విస్తరించడానికి, అలాగే జడ్చర్ల బైపాస్ రోడ్డు కు సంబంధించిన పనులపై అధ్యయనం చేసి డీపీఆర్ (డిటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్) ను రూపొందించడానికి కన్సల్టెంట్ ను నియమించడం జరిగిందని, వారి నుంచి డీపీఆర్ వచ్చిన తర్వాత, ఈ పనులను చేపట్టడానికి ఈ ఏడాది బడ్జెట్లోనే నిధులు కేటాయిస్తామని కూడా గడ్కరీ స్పష్టం చేసారని వివరించారు. దీంతో జడ్చర్ల బైపాస్ నిర్మాణానికి మార్గం సుగమమైయిందని అభిప్రాయపడ్డారు. జడ్చర్ల బైపాస్ నిర్మాణంతో జడ్చర్ల పట్టణం మరింత విస్తరించడంతో పాటుగా పట్టణ ప్రగతి కూడా పరుగులు పెడుతుందని అభిప్రాయపడ్డారు. జడ్చర్ల బైపాస్ రోడ్డు మంజూరు కోసం తనకు ఎంతగానో సహకరిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర రోడ్డు భవనాల శాఖామంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, తనతో పాటుగా ఈ రోడ్డు మంజూరుకు కృషి చేస్తున్న ఎంపీ డీకే అరుణ, మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి తదితరులకు ఈ సందర్భంగా అనిరుధ్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

## రైతులకు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి



సమావేశానికి హాజరైన అధికారులు

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

**గద్వాల టౌన్ అక్టోబర్ 7, ప్రభాతవార్త:** వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్ అన్నారు. మంగళవారం గద్వాలలోని ఐడిఓసి సమావేశ మందిరంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఇన్చార్జిలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. ఖరీఫ్ పంటకు సంబంధించి నవంబర్ మొదటి వారం నుంచి రైతులు తాము పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలోనే ఈనెల 8వ తేదీ నుంచి జిల్లాలో మొత్తం 84 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల వద్ద తూకాలు, ధాన్యం తేమను నిర్ధారించే యంత్రాలు, గన్ని సంచుల కొరత లేకుండా చూసుకోవాలన్నారు. గత సీజన్లో కొన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద గన్ని సంచుల కొరత, ఇతర ఇబ్బందుల వలన చాలా మంది రైతులు 15 రోజులకు పైగా తమ ధాన్యాన్ని విక్రయించేందుకు కేంద్రాల వద్ద వేచి ఉండాల్సి వచ్చిందని గుర్తుచేస్తూ, గత సమస్యలను దృష్టిలో ఉంచుకొని ఈ దఫా రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందస్తుగా కేంద్రాల వద్ద తగు ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు. రైతులు తాము పండించిన ధాన్యం తేమ లేకుండా కల్లాల వద్దే సరిగ్గా ఆరబెట్టుకొని వచ్చేలా సంబంధిత వ్యవసాయ అధికారులు సూచించాలన్నారు.కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు సమీపంలోని మిల్లులకు చేరవేయడానికి అవసరమైన హమాలీలు, వాహనాల కొరత లేకుండా తగు చర్యలు తీసుకోవాలని అన్నారు. ధాన్యం సేకరణ బాధ్యతలను ఆయా గ్రామాల్లోని మహిళా సంఘాల సభ్యులకు అప్పగించడంతో వారు మాత్రమే నిబంధనల ప్రకారం కొనుగోలు చేయాలన్నారు. కేంద్రాల వద్ద వారు కాకుండా ఇతరులు ధాన్యం కొనుగోలు చేస్తున్నట్లు తెలిస్తే తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర ఈసారి రూ.69 పెంచిన నేపథ్యంలో, సన్నబియ్యానికి క్వింటాలుకు రూ. 2,389/ తో పాటు రాష్ట్ర ప్రభుత్వం – మిగతా4లో..

## ఆదర్శం.. వాల్మీకి జీవితం

### మహబూబ్‌నగర్ ఎస్పీ జానకి

### జిల్లా పోలీస్ కార్యాలయంలో వాల్మీకి జయంతి వేడుకలు

**మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబరు 7 ప్రభాతవార్త:** మహర్షి వాల్మీకి మన దేశానికి ఆదర్శ ప్రాయమైన కవి,ఆధ్యాత్మిక గురువుగా నిలిచారని మహబూబ్‌నగర్ ఎస్పీ జానకి ధరావత్ అన్నారు. వాల్మీకి జయంతి సందర్భంగా మంగళవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వాల్మీకి రామాయణాన్ని రచించి సత్యం, ధర్మం, న్యాయం, నిష్కామ సేవ వంటి విలువలను సమాజానికి చాటిచెప్పారు. ఆయన చూపిన మార్గంలో నడిచి ప్రతి ఒక్కరూ నిజాయితీ, నిబద్ధతతో జీవించాలి" అని అన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎన్.బి. రత్నం, ఏఆర్ అదనపు ఎస్పీ సురేష్ కుమార్, డీసీఆర్‌బీ డీఎస్పీ రమణా రెడ్డి, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, ఏఓ రుక్మిణి భాయి, ఎస్బి ఇన్స్పెక్టర్ వెంకటేష్, ఆర్‌ఐ కృష్ణయ్య, ఆర్‌ఎస్‌ఐలు, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



మహర్షి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్పీ జానకి, పోలీస్ అధికారులు



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేంద్ర బోయి

## పునరావాసం పనులు వేగవంతం చేయాలి

### ప్లాట్ల కేటాయింపు త్వరితగతిన చేపట్టాలి

### రెవెన్యూ, ఇరిగేషన్, సర్వే

### ల్యాండ్ రికార్డ్స్ పై కలెక్టర్ విజయేంద్ర బోయి సమీక్ష

**మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబరు 7 ప్రభాతవార్త:** ఉదండపూర్ రిజర్వాయర్ నిర్వాసిత కుటుంబాలకు కేటాయించే ప్లాట్ల పనులను వేగవంతంగా పూర్తిచేసి త్వరితగతిన కేటాయించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని మినీ సమావేశ మందిరంలో రెవెన్యూ,ఇరిగేషన్,సర్వే ల్యాండ్ రికార్డ్స్,మిషన్ భగీరథ,సంబంధిత అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఉదండాపూర్ రిజర్వాయర్ కింద వల్లూరు, ఉదండపూర్, తుమ్మలకుంట తండా, రేగడిపట్టి తండా, చిన్నగుట్ట తండా,శామగడ్డతండా,ఒంటిగుడిసె తండా,పోలేపల్లి –మిగతా4లో..

## వెంచర్ యజమానులకు నోటీసులు

### - పెద్దాయిపల్లి, షేరిగూడలో

### ఏర్పాటు చేసిన వెంచర్లపై విచారణకు రంగం సిద్ధం

వార్త ఎఫెక్ట్

**బాలానగర్,అక్టోబర్ 7, ప్రభాతవార్త:** ప్రభుత్వ భూమిలో ప్రైవేటు వ్యక్తులు వెంచర్ ఏర్పాటు చేయడం రోడ్డును ఏర్పాటు చేయడం వెంచర్కు సంబంధించి ఆర్చ్ నిర్మించారని పలువురు ఫిర్యాదుల మేరకు బాలానగర్ తాసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి స్పందించారు. వెంచర్ యజమాలకు నోటీసులు పంపించారు. కెమెరాకు మండలంలోని శేరిగూడ గ్రామంలోని సర్వేనెంబర్ 78లో సిద్ధి వినాయక వెంచర్స్ ప్రైవేటైజ్ లిమిటెడ్ వారు 20గుంటల పొలాన్ని కమాన్ ఆర్చు కోసం ఆక్రమించారని, అదేవిధంగా పెద్దాయి పల్లి గ్రామంలో సర్వే నెంబర్ 105లో రికావ్యాలీ ప్రైవేట్ లిమిటెడ్ వెంచర్ నిర్వహకులు 16 గుంటల ప్రభుత్వ పొలంలో రోడ్డు కమాన్ నిర్మించారని తాసిల్దార్ వెంచర్ నిర్వహకులకు నోటీసులు పంపించారు.

## వాల్మీకి మహర్షి జీవితం ఆదర్శప్రాయం : కలెక్టర్ సంతోష్

**గద్వాలటౌన్, అక్టోబర్ 7 ప్రభాతవార్త:** రామాయణ గ్రంధాన్ని రచించి లోకానికి పరిచయం చేసిన మహనీయుడు వాల్మీకి మహర్షి జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శప్రాయమని జిల్లా కలెక్టర్ బి.ఎం.సంతోష్ అన్నారు. వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా మంగళవారం గద్వాల కలెక్టరేట్లో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు నిర్వహించి ఘనంగా – మిగతా3లో..



వాల్మీకి చిత్ర పటానికి నివాళ్ళు అర్పిస్తున్న కలెక్టర్ సంతోష్, కార్యాలయ అధికారులు

## ప్రతి కేసులోనూ నిందితులకు శిక్ష పడేలా ఆఫీసర్‌లు కృషి చేయాలి

### కోర్టు విధులు సమర్థవంతంగా నిర్వర్తించడం వల్ల ఎక్కువ కేసులు పరిష్కారం

### పెండింగ్ నాన్ బెయిలబుల్ వారెంట్లను పూర్తిగా అమలుచేయాలి: జిల్లా ఎస్పీ



సమావేశంలో పాల్గొన్న డ్యూటీ పోలీసులు



మాట్లాడుతున్న ఎస్పీ

**వనపర్తి,అక్టోబరు7 ప్రభాతవార్త:** కోర్టు కేసులలో శిక్షల శాతాన్ని పెంచడం, తప్పు చేసిన నిందితులకు శిక్ష పడేలా చేయడం ద్వారా ప్రజలకు పోలీసు శాఖపై మరింత గౌరవం, నమ్మకం పెరుగుతుందని జిల్లా ఎస్పి రావుల గిరిధర్ అన్నారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో అధికారులు,కోర్టు డ్యూటీ కానిస్టేబుల్‌లతో జిల్లా ఎస్పీరావుల గిరిధర్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కోర్టు కేసుల్లో నిందుతులకు శిక్షలు పడినప్పుడే నేరాల నియంత్రణ సాధ్యమవుతుందని, ఇందుకు అనుగుణంగా కేసులు పెండింగులో లేకుండా చూసుకోవాలన్నారు. కోర్టు కానిస్టే బుల్ బాధ్యత చాలా కీలకమైనదని, ఎఫ్ఐఆర్ నమోదు అయినప్పటి నుండి కేసు పూర్తయ్యేంతవరకు నిందితుల నేరాలను నిరూపించేందుకు అవసరమైన రుజువులు, పత్రాలు, సాక్షుల వాగ్మూలంను కోర్టుకు సమర్పించడంలో కోర్టు పోలీసు అధికారులు వ్యక్తిగత బాధ్యత తీసుకోవాలని సూచించారు. సాక్షులను, బాధితులను సమయానికి కోర్టులో హాజరు పరిచేలా చూసుకోవాలని, బాధితులకు, సాక్షులకు కేసుకు సంబంధించిన విషయాలలో అవగాహన కల్పించాలన్నారు. కోర్టు సమాచారం ప్రాసిక్యూషన్‌కు సంబంధించిన సమాచారం ఎప్పటికప్పుడు సంబంధిత ఎస్పైలకు తెలియజేయాలని అన్నారు. ఈ సందర్భంగా పెండింగ్ కేసుల పరిష్కారానికి సంబంధించి పలువురు కోర్టు కానిస్టేబుళ్లను అడిగి కేసుల పురోగతిపై సూచనలు చేశారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులు, నాన్ బెయిలబుల్ వారెంట్స్, (ఎన్‌బిడబ్ల్యు) సమన్స్ సమీక్షించి త్వరగా నాన్ బెయిలబుల్ వారెంట్స్ కోర్టులో హాజరుపరిచి ఎన్‌బిడబ్ల్యులను పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో డిసిఆర్బి డిఎస్పీ, ఉమామహేశ్వరావు, స్పెషల్ బ్రాంచ్ సీఐ, నరేష్, డిసిఆర్బి ఎస్సై, తిరుపతిరెడ్డి, జిల్లాలోని అన్ని పోలీస్టేషన్ల కోర్టు డ్యూటీ అధికారులు పాల్గొన్నారు.

## పాఠశాలలను ఆకస్మిక తనిఖీ చేసిన డీఈఓ



విద్యార్థుల విషయ పరిజ్ఞానాన్ని పరిశీలిస్తున్న డీఈఓ రమేష్ కుమార్

**కల్వకుర్తి,అక్టోబర్ 7 ప్రభాతవార్త:** వెల్దం డ, చారకొండ మండలాల్లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, జూపల్లి పాఠశాలలను నాగర్‌కర్నూల్ జిల్లా వి ద్యాశాఖ అధికారి ఏ.రమేష్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో ఉన్న తరగతి గదులను, పాఠశాల పరిస రాలు, వంట గదులను తనిఖీ చేశారు. అదేవిధంగా మధ్యాహ్న భోజనంను కూడా పరిశీలించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరును పరిశీలించి, ప్రాథమిక స్థాయిలో విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందు కు కృషి చేయాలని సూచించారు. విద్యార్థులకు పుస్తక పఠనంపై ఆసక్తిని పెంచేలా ఉపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. అలాగే తరగతి గదిలో విద్యార్థులకు గణిత సబ్జెక్టులపై బోధన చేసి విద్యార్థులకు గణితంలో మేళుకువలను నేర్పించారు. గణితంపై ఆసక్తిని పెంచేలా ఉపాధ్యాయులు ప్రయోగాత్మకంగా బోధనా పద్ధతులు చేపట్టాలని సూచించారు. డీఈఓ వెంట జిల్లా టెస్ట్ బుక్ మేనేజర్ నరసింహులు ఉన్నారు.

## ఆర్డీవో కార్యాలయంలో ఆకస్మిక తనిఖీలు



రికార్డులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

**గద్వాల టౌన్, అక్టోబర్ 7, ప్రభాతవార్త:** భూభారతి పెండింగ్ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆర్డీఓ, ఇతర సిబ్బందితో భూభారతి అమలుపై సమీక్ష జరిపారు. రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులలో ఆయా మాడ్యుల్స్ లో ఎన్ని అర్జీలు పరిష్కరించారు, ఎన్ని పెండింగ్ లో ఉన్నాయి, ఎంత మందికి నోటీసులు ఇచ్చారు, క్షేత్రస్థాయి పరిశీలన ప్రక్రియ పూర్తయ్యిందా తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. నిర్ణీత గడువు లోపు అన్ని దరఖాస్తులు పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు. దరఖాస్తులు తిరస్కరణ అయితే, అందుకు గల కారణాలు స్పష్టంగా పేర్కొనాలని సూచించారు. భూభారతి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, అర్జీల పరిష్కారంలో జాప్యం జరుగకుండా రోజువారీగా దరఖాస్తుల పరిశీలనను పర్యవేక్షిస్తూ, వేగవంతంగా వాటిని పరిష్కరించేందుకు చిత్తశుద్ధితో కృషి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ అలివేలు, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఏ టి సి సెంటర్లలో విద్యార్థుల తరగతి గదుల పనులను త్వరగా పూర్తి చేయాలి



పనులను పరిశీలిస్తూ ఆదేశాలు జారీ చేస్తున్న కలెక్టర్

**గద్వాలటౌన్, అక్టోబర్ 7, ప్రభాతవార్త:** అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ (ఏటిసి) లోని అన్ని పనులను పూర్తి చేసి, విద్యార్థులకోసం తరగతులను వెంటనే ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. గద్వాల్ పట్టణంలోని ఆధునాతన సాంకేతిక కేంద్రం నూతన భవన నిర్మాణ పనులను మంగళవారం జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆధునాతన టెక్నాలజీ సెంటర్ల ద్వారా యువతకు నాణ్యమైన నైపుణ్య శిక్షణ అందించేందుకు కృషి చేస్తాం దని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న పనులను పరిశీలించిన కలెక్టర్ వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా ఎపాక్సీ ఫ్లోరింగ్ పనులను తక్షణమే పూర్తి చేయాలని సూచించారు. అలాగే మిగిలిన సివిల్ పనులను ఈ నెల 20వ తేదీలోగా పూర్తిచేయాలని ఆదేశించారు. త్వరగా కేంద్రంలో తరగతులను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సహాయ లేబర్ కమిషనర్ మహేష్ కుమార్, ఐటిఐ కళాశాల ప్రిన్సిపల్ సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ కలీం తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కానిస్టేబుల్ చేయూత



విద్యార్థులకు టై,బెల్టు, షూస్ అందజేసిన దృశ్యం

**నారాయణపేట, అక్టోబరు 7 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా కేంద్రంలోని పళ్ళ పరిమళాపురం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు యువకుడు పెద్దమెట్ల అశోక్ ప్రేరణాత్మక సేవ చేశారు. ఆర్థిక ఇబ్బందులు కుటుంబ సమస్యలతో చదువును ఆపకూడదన్న సంకల్పంతో విద్యార్థులకు చేయూత అందించారు. 2024లో వారియర్స్ డిఫెన్స్ అకాడమీలో ఉచిత శిక్షణ పొంది కానిస్టేబుల్ ఉద్యోగం సాధించిన అశోక్ తన పూర్వ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన 120మంది విద్యార్థులకు టైలు, బెల్టులు, షూస్,ఐడి కార్డులు అందజేశారు. తాను కూడా ఈ పాఠశాలలోనే చదివానని కష్టపడి ఉద్యోగం సాధించానని చెప్పారు. విద్యార్థులు లక్ష్యసాధన కోసం పట్టుదలతో చదువుకోవాలని సూచించారు. తల్లిదండ్రులకు గురువులకు మంచి పేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సమాజంలోని యువత చేయూత అందించాలని ఆకాంక్షించారు. తన మిత్రుడు వెంకటేష్ ప్రసాద్ కూడా ఈ సేవలో ప్రోత్సాహమందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సోనీ, లక్ష్మీ, కళ్యాణి, ప్రియాంక, లాలప్ప వారియర్స్ డిఫెన్స్ అకాడమీ డైరెక్టర్ అంజనేయులు ఆర్మీ వాచ్ పాయి తదితరులు కూడా హాజరయ్యారు.

## ఎంబిబిఎస్ సీట్ సాధించిన విద్యార్థినికి సన్మానం



విద్యార్థినిని సన్మానిస్తున్న దృశ్యం

**మక్తల్ టౌన్, అక్టోబరు 7 ప్రభాతవార్త :** నాగర్‌కర్నూల్ గవర్నమెంట్ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీట్ సాధించిన డి. నందినిను బ్రిలియంట్ హైస్కూల్ మక్తల్ పాఠశాల సిబ్బంది మంగళవారం ఘనంగా సన్మానించారు. పాఠశాల ప్రిన్సిపల్ సుజిత మాట్లాడుతూ 2021,22 విద్యా సంవత్సరంలో బ్రిలియంట్ స్కూల్లో టెన్త్ పూర్తి చేసుకున్నట్టు తెలిపారు. నందిని మంచి ప్రజ్ఞాశాలని, క్రమశిక్షణ కలిగిన విద్యతోనే నీట్ యూజీ పరీక్షలో 455 మార్కులు సాధించి మెడికల్ సీట్ సాధించుకున్నందుకు అభినందిస్తూ శాలువా, మెమెంటోతో సత్కరించారు. విద్యార్థినిని ప్రోత్సహిస్తూ ముందు చదువులు చదివిస్తున్న నందిని తల్లిదండ్రులను శాలువాతో సన్మానించారు. ఎంబిబిఎస్‌లో శ్రద్ధతో చదివి, వైద్యురాలిగా విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది ఉన్నారు.

## నిందితుడికి కఠిన శిక్ష విధించాలని సిపిఎం డిమాండ్



నిందితుడికి శిక్షించాలని డిమాండ్ చేస్తున్న నాయకులు

**నారాయణపేట, అక్టోబరు 7 ప్రభాతవార్త :** భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయి పైన బూటు విసరడానికి ప్రయత్నించిన రాకేష్ కిషోర్ పై కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జి.వెంకట్రామిరెడ్డి డిమాండ్ చేశారు. అంబేద్కర్ చౌరస్తాలో సిపిఎం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ దేశంలో మతోన్మాద దాడులు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మతం పేరుతో మైనార్టీలపై కులం పేరుతో దళితులపై మహిళలపై దాడులు జరుగుతున్నాయని అన్నారు. నయా ఫాసిజం పెరుగుతోందని గవాయి పై దాడి సంఘటన దానికి నిదర్శనం అని పేర్కొన్నారు. సనాతన ధర్మం పేరుతో విద్వేషం రగిలించడంలో మతోన్మాద సంస్థలు చురుకుగా ఉన్నాయని విమర్శించారు. భారత రాజ్యాంగాన్ని కాపాడి సమానత్వం కోసం ప్రజలు ఏకతాటిపైకి రావాలని పిలుపునిచ్చారు. గవాయి పై దాడి చేసిన రాకేష్ కిషోర్‌ను సోషల్ మీడియాలో వీరుడిగా చూపించడం హాస్యాస్పదమని అన్నారు. మహాత్మా గాంధీని చంపిన గాడ్సేను దేశభక్తుడని చెప్పే స్థాయికి పరిస్థితి దిగజారిందని అన్నారు,. ఈ నిరసనలో కామ్రేడ్ గోపాల్, బాలరామ్, అరుణ్, గోవిందు, పవన్ కుమార్, వడ్డే రాము తదితరులు పాల్గొన్నారు.

# ధర్మ మార్గాన్ని చూపిన మహనీయులు వాల్మీకి.!




మహర్షి వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జిల్లా ఎస్పీ



పూలమాలవేసి నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్



వాల్మీకి జయంతి వేడుకల్లో పాల్గొన్న భీష్మరాజ్ ఫౌండేషన్ ఛైర్మన్



వాల్మీకి ఉత్సవాలు నిర్వహిస్తున్న దృశ్యం

**వనపర్తి, అక్టోబరు 7 ప్రభాతవార్త:** మహర్షి వాల్మీకి జీవితం ప్రతి మనిషిలో మార్పుకు ప్రేరసంస్కృత సాహిత్యంలో అత్యంత ప్రసిద్ధ కవి, రామాయణం మహాకావ్య రచయిత "ఆదికవి" వాల్మీకి మహర్షి అని జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. మంగళవారం వనపర్తి జిల్లా పోలీసు కార్యాలయంలో మహర్షి వాల్మీకి జయంతి సందర్భంగా జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ..మహర్షి వాల్మీకి రచించిన రామాయణం మనిషి జీవనానికి మార్గదర్శక గ్రంథమని, ఆయన చూపిన సత్యం, ధర్మం, కర్తవ్య మార్గాలు నేటి సమాజానికి కూడా ప్రేరణ కలిగిస్తాయని మహర్షి వాల్మీకి తొలుత దొంగగా జీవనం సాగించినప్పటికీ, తన గురువు బోధనల ద్వారా ప్రేరణ పొంది, పశ్చాత్తాపంతో సద్గుణమార్గం వైపు మళ్లారు. ఆత్మశోధన ద్వారా మహానుభావుడిగా మారి, మనందరికీ ఆదర్శప్రాయమైన రామాయణం అనే గ్రంథాన్ని రచించారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఏఆర్ అదనపు ఎస్పీ, వీరారెడ్డి, డిసిఆర్బి డిఎస్పీ, ఉమా మహేశ్వరావు, కార్యాలయం ఏవో, సునందన, స్పెషల్ బ్రాంచ్ సీఐ,నరేష్, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు, అప్పలనాయుడు, శ్రీనివాస్, జిల్లా పోలీసు కార్యాలయం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

**దేశానికి జ్ఞానాన్ని అందించిన మహనీయుడు వాల్మీకి**

**అదనపు కలెక్టర్ రెవెన్యూ ఖీమ్యా నాయక్**

**వనపర్తి, అక్టోబరు 7 ప్రభాతవార్త:** దేశానికి జ్ఞానాన్ని అందించిన మహనీయుడు వాల్మీకి అని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఖీమ్యా నాయక్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వాల్మీకి మహర్షి జయంతిని ఘనంగా నిర్వహించారు. అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ హాజరై వాల్మీకి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ దేశానికి ఆధ్యాత్మిక జ్ఞానాన్ని అందించిన మహనీయుడు వాల్మీకి మహర్షి అని కొనియాడారు. మహాకవి వాల్మీకి హిందూ ధర్మానికి అతి ముఖ్యమైన గ్రంథం రామాయణాన్ని రచించారని.. రామాయణం ద్వారా సమాజానికి అనేక విలువలను అందించారన్నారు. ప్రపంచం ఉన్నంత వరకు రామాయణ, వాల్మీకి చరిత్ర ఉంటుందని, ఇతిహాసాల్లో మొదటిది రామాయణమని చెప్పారు. మహనీయుల జీవితాలను నేటి యువత ఆదర్శంగా తీసుకుని వారి ఆశయాల సాధన దిశగా కృషి చేయాలన్నారు. కలెక్టరేట్ ఏవో భాను ప్రకాష్, బీసీ సంక్షేమ శాఖ అధికారులు, ఇతర అధికారులు, సిబ్బంది, వాల్మీకి సంఘం నాయకులు, ఇతర ప్రజాసంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

**ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు**

**నారాయణపేట, అక్టోబరు 7 ప్రభాతవార్త :** నారాయణ పేట మండలం పరిధిలోని కొల్లంపల్లి గ్రామంలో ఆదికవి వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా వాల్మీకి మహర్షి దేవాలయంలో ఘనంగా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భీష్మరాజ్ ఫౌండేషన్ ఛైర్మన్ డా. కె. రాజ్ కుమార్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి వాల్మీకి మహర్షి చూపిన సత్యం ధర్మం న్యాయం మార్గంలో యువతరం పయనించాలని సూచించారు. తదనంతరం దేవాలయ నిర్వాహకులు గ్రామస్థులు ఆయనకు శాలువా కప్పి ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు గుజ్జుల కృష్ణన్న. బుడ్డ నర్సింహ, బద్రి మారుతి, పుల్లరి నరేష్, వాల్మీకి యువసేవ ప్రతినిధులు, ఫౌండేషన్ సభ్యులు రాఘవేందర్ గౌడ్, వై. సంతోష్, కరాటే అశోక్, ఎం. సంతోష్ ,వాచ్యా నాయక్, బాలునాయక్, దశరథ్ నాయక్, మోహన్ నాయక్, చంద్యా నాయక్, శ్రీనివాస్, బలరాం తదితరులు పాల్గొన్నారు మహిళలు కూడా ఉత్సాహంగా పాల్గొన్నారు.

**వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు**

**శ్రీరంగాపూర్, అక్టోబరు 7 ప్రభాతవార్త :** శ్రీరంగాపూర్ మండల కేంద్రంలో వివిధ గ్రామాలకు సంబంధించిన నాయకులు గ్రామ ప్రజలు యువకులు వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాల్మీకి మహర్షి విగ్రహానికి పూలమాలలు వేసి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీరంగాపురం మండల నాయకులు, యువకులు వాల్మీకులు గ్రామ ప్రజలు పాల్గొనడం జరిగింది.

**భక్తి శ్రద్ధలతో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు**

**ఊట్కూర్, అక్టోబరు 7 ప్రభాతవార్త :** ఊట్కూర్ మండల పరిధిలోని చిన్నపొర్ల గ్రామంలో వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా గ్రామ ప్రజలు ఘనంగా వేడుకలు నిర్వహించారు. కృష్ణానది తీరం నుంచి జల్ది బిందెలలో పవిత్ర జలాన్ని తీసుకువచ్చి వాల్మీకి మహర్షి విగ్రహానికి అభిషేకం చేసి పూజలు చేశారు. అనంతరం భక్తులందరికీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మాలిపటేల్ రవీందర్ రెడ్డి, పూజారి రామారావ్, సంజప్ప, దొబ్బలి హన్మంతు తదితరులు పాల్గొన్నారు. గ్రామస్తులు మహర్షి బోధించిన సత్యం, ధర్మం, నీతి మార్గాలను గుర్తు చేసుకున్నారు. అలాగే వాల్మీకి వంశస్తుల సంక్షేమానికి ప్రభుత్వం మరింత కృషి చేయాలని గ్రామస్తులు కోరారు. గ్రామ పెద్దలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

**నేటి సమాజానికి ఆదర్శనీయుడు వాల్మీకి మహర్షి**

**బాసు హనుమంతు నాయుడు**

**గద్వాల టౌన్ అక్టోబర్7, ప్రభాతవార్త:** రామాయణ సృష్టికర్త వాల్మీకి మహర్షి నేటి సమా జానికి ఆదర్శనీయుడని బిఆర్ యస్ పార్టీ గద్వాల నియోజకవర్గ ఇంచార్జీ బాసు హనుమంతు నాయుడు పేర్కొన్నారు. మంగళవారం వాల్మీకి జయంతిని పురస్కరించుకుని గద్వాల, ధరూర్, గొనుపాడు, పార్చర్ల, మన్నాపురం గ్రామంలో వాల్మీకి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేసి, చిత్ర పటానికి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాల్మీకి మహర్షి ఆశయాలకుఅనుగుణంగా ప్రతిఒక్కరూ నడుచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వరరెడ్డి, కోటేష్, రాజారెడ్డి, చిన్నపాడు అంజనేయులు, వెంకటేష్ నాయుడు, శేఖర్ నాయుడు, అంజి, తిరుమలేష్, రాము, ఆంజనేయులు వాల్మీకి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి ఉత్సవాలు**

**మహబూబ్‌నగర్ (మూసాపేట) అక్టోబరు 7 ప్రభాతవార్త :** మూసాపేటమండలంలో చక్రాపుర్, వేముల జనంపేట్ గ్రామాలలో మంగళవారం వాల్మీకి మహర్షి జయంతిని బోయ వాల్మీకులు ఘనంగా జరుపుకున్నారు గ్రామలలో ట్రాక్టర్లు, బైకులతో భక్తి గీతాలతో శోభయాత్ర నిర్వహించుకొని వాల్మీకి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి ఘనంగా పూజాకార్యక్రమం నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఛక్రాపూర్ వాల్మీకి సంఘ సభ్యులు బోయ అబ్దుల్లా, ఇస్రంపల్లి తిరుపతయ్య, గురకొండా ఆంజనేయులు, పెద్ద బుచ్చన్న గంటెల లక్ష్మి నారాయణ, ప్రతాప్ రెడ్డి, గబలి మహేష్, దయాకర్ గౌడ్, వేముల గ్రామ వాల్మీకి సంఘ సభ్యులు, గ్రామ మాజీ సర్పంచ్ అరుణ రఘుపతి రెడ్డి, మాజీ ఎంపిటిసి సత్యనారాయణ, మూసాపేట మండల బిజెపి అధ్యక్షులు టికె నరసింహ, సుధాకర్, బోయ పెద్ద బాలయ్య, ఆంజనేయులు, గుజ్జుల నాగన్న, నరసింహ, యువకులు, చిన్నారులు పాల్గొన్నారు.



వాల్మీకి జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్న దృశ్యం



వాల్మీకి విగ్రహానికి నివాళ్ళు అర్పిస్తున్న దృశ్యం



వాల్మీకి మహర్షి జయంతి ఉత్సవాలు

## ఆసుపత్రి నిర్మాణం త్వరితగతిన ప్రారంభించాలి

**రోడ్ల విస్తరణ పనులు పూర్తి చేయాలి.. బీసీ పొలిటికల్ జేఏసీ స్టేట్ ఛైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్**



పత్రికా సమావేశంలో మాట్లాడుతున్న బీసీ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర ఛైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్

**వనపర్తి (పెబ్బేరు) అక్టోబరు 7 ప్రభాతవార్త:** పెబ్బేరు పట్టణం గ్రామపం చాయతీ నుంచి మున్సిపాలిటీగా మారిన తరువాత చాలా సమ స్యలతో సతమతమవుతుందని బీసీ పొలిటికల్ జెఎసి స్టేట్ ఛైర్మన్ డా. రాచాల యుగంధర్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవా రం పెబ్బేరు పట్టణంలోని ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పెబ్బేరు సంత ద్వారా వారానికి రూ.6.36లక్షల మేర వచ్చే ఆదాయం ద్వారా పట్టణంలో అభివృద్ధి పనులు చేపట్టేవారని, సంత స్థలం వివాదం కోర్టుపరిధిలో ఉండటంతో పట్టణ అభివృద్ధి కుంటుపడిందన్నారు. ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే మేఘారెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని సంతస్థలానికి శాశ్వతపరిష్కారం చూపాలన్నారు. నాలుగునెలల క్రితం పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో 30పడకల ఆసుపత్రి కోసం ఎమ్మెల్యే మేఘారెడ్డి శంకుస్థాపన చేశారు. కాని సదరుకాంట్రాక్టరు ఇప్ప టిదాకా నిర్మాణ పనులు మొదలుపెట్టలేదని, ఎన్నో ఏళ్లుగా తీరనికలగా ఉన్న 30పడకల ఆసుపత్రికి కాంగ్రెస్ ప్రభుత్వం మోక్షం కల్పించినా నిర్మాణానికి నోచుకోవడం లేదని, కనుక ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి వెం టనే నిర్మాణ పనులు ప్రారంభించి పెబ్బేరు సమీప మండలాల ప్రజలకు ఆరోగ్యసేవలు అందించేలా చూడాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం స్థానికసంస్థల ఎన్నికల్లో బీసీలకు 42రిజర్వేషన్ కల్పిస్తూ జీవో ఇచ్చిందని, అది కోర్టులో కేసు నడుస్తోందని, కోర్టు తీర్పు ఏదైనా సరే బీసీలకు 42రిజర్వేషన్ మాత్రం తొలగిస్తే బీసీ పొలిటికల్ జేఏసీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తు న పోరాటాలు చేస్తామని, ఈ సారి వనపర్తి గడ్డపై జడ్పీ పీఠాన్ని కైవసం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ పొలిటికల్ జెఎసి రాష్ట్ర కార్యదర్శి వివి గౌడ్, శ్రీరంగాపూర్ మండల అద్యక్షుడు ధర్మేంద్ర సాగర్, వనపర్తి పట్టణ అధ్యక్షుడు దేవర శివ, కొత్తకోట మండల అద్యక్షులు అంజన్న యాదవ్, జిల్లా కార్యదర్శి బత్తుల జితేందర్, ఆర్టీఐ విభాగం ఉపాధ్యక్షులు రాఘవేందర్ గౌడ్, గౌడ సంఘం మండల అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, నాయకులు చెలిమిల్ల రామన్ గౌడ్,రమేష్, యశ్వంత్,వ న్యాదరి రాజు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయస్థాయి పోటీలో రాణిస్తున్న రఘుపతిపేట క్రీడా కుసుమాలు

**- జాతీయ అత్యపత్య క్రీడల్లో తెలంగాణ ప్రతినిధులుగా యామిని, పావని**



పాఠశాల ఉపాధ్యాయ బృందంతో విద్యార్థినులు





యామిని, పావని

**కల్వకుర్తి,అక్టోబర్7 ప్రభాతవార్త:**కల్వకుర్తి మండలంలోని రఘుపతిపేట్ జడ్పిహెచ్ఎస్ విద్యార్థినిలు పావని, యామిని తమ ప్రతిభతో మరోసారి రఘుపతిపేట్ పేరును జాతీయ స్థాయిలో వెలుగులోకి తీసుకొచ్చారు. రాష్ట్ర స్థాయి అత్యపత్య పోటీల్లో సత్తా చాటి జాతీయ స్థాయిలో తెలంగాణ తరపున ప్రాతినిధ్యం వహించనున్నారని పాఠశాల హెచ్ఎం ఎస్.అంజయ్య, ఫిజికల్ డైరెక్టర్ పోలే అంజయ్యలు వర్షం వ్యక్తం చేశారు. ఈనెల 9నుంచి 12వరకు కర్ణాటక రాష్ట్రంలోని చందార్గీ పట్టణంలో జరగనున్న సీనియర్ అత్యపత్య జాతీయస్థాయి క్రీడల్లో వీరిద్దరూ పాల్గొంటున్నట్లు హెచ్ఎం తెలిపారు. గ్రామ స్థాయి నుంచి మండల, జిల్లా, రాష్ట్రస్థాయిల వరకు ప్రతిభ కనబరిచిన పావని, యామిని, తమ కష్టపడి సాధనతో ఈ స్థాయికి చేరుకున్నారని వారు పేర్కొన్నారు. క్రీడాకారునిలు యామిని, పావనిలతో రఘుపతిపేట్ జడ్పిహెచ్ఎస్ పాఠశాలకు జాతీయ స్థాయిలో గుర్తింపు దక్కిందని ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తంచేశారు. విద్యార్థినిల కృషి, క్రమశిక్షణ, క్రీడాపట్ల అంకితభావం ఇతర విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు రామకృష్ణ, షకీల్ అహ్మద్, భాస్కర్, మల్లయ్య, విజ్జి, తిరుపతయ్య, జయశ్రీబాయి, శ్రీనివాసచారి, సుభాష్ రెడ్డి తదితరులు హర్షం వ్యక్తం చేశారు. జాతీయ స్థాయి పోటీలో రాణిస్తున్న తమ గ్రామ క్రీడాకారుల పట్ల గ్రామస్థులు, తల్లిదండ్రులు, సహ విద్యార్థులు కూడా పావని, యామిని విజయంపై ఆనందం వ్యక్తం చేస్తూ జాతీయ స్థాయిలో కూడా మెరుగైన ఫలితాలు సాధించి తెలంగాణకు గౌరవం తెచ్చిపెట్టాలంటూ శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం పాఠశాల ప్రాంగణంలో విద్యార్థినిలకు ఘన స్వాగతం లభించగా, వారిని గౌరవిన్తూ పూలమాలలు వేసి ఉపాధ్యాయులు, సహ విద్యార్థులు సత్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు మాట్లాడుతూ మాకు నిరంతరం మార్గదర్శకత్వం అం దించిన మా ఉపాధ్యాయులందరికీ ధన్యవాదాలు. జాతీయ స్థాయిలో నూ మా పాఠశాల పేరును గర్వంగా నిలబెడతాం" అన్నారు.

## పేట భవానీ మందిర్‌లో ముగిసిన నవరాత్రి వేడుకలు



అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

**నారాయణపేట టౌన్, అక్టోబరు 7 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా కేంద్రంలోని దూల్ పేట అంబా భవానీ మందిరంలో ఎస్ఎస్‌కే సమాజ్ ఆధ్వర్యంలో మంగళవారం దేవీ నవరాత్రి వేడుకలు ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బాలబాలికల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా పూజారి సీతారాం దీక్షిత్‌ను సమాజం పెద్దలు శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం పెద్ద ఎత్తున అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.

## సిజేఐపై దాడికి నిరసనగా పేట కోర్టులో న్యాయవాదుల బహిష్కరణ

**నారాయణ పేట్ టౌన్, అక్టోబరు 7 ప్రభాతవార్త :** సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్ గవాయ్‌పై న్యాయవాది దాడికి దిగిన సంఘటనను నిరసిస్తూ మంగళవారం నారాయణ పేట జిల్లా కోర్టులో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విధులను బహిష్కరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ దాడి హేయమైనచర్య అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దామోదర్ గౌడ్, ఉపాధ్యక్షుడు నందు నామాజీ, ప్రధాన కార్యదర్శి చెన్నారెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.

## రైతులకు వేరుశనగ విత్తనాలు పంపిణీ



సహకార సంఘంలో రైతులకు వేరుశనగ విత్తనాలు పంపిణీ

**ఉప్పునుంతల, అక్టోబరు7 ప్రభాతవార్త:**స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం రైతు ఉత్పత్తిదారుల సంస్థ (ఎఫ్‌పిఒ) సభ్యులకు సాగులో భాగంగా మంగళవారం రైతులకు వేరుశనగ విత్తనాలు పంపిణీ చేశారు. వేరుశనగ విత్తనాలు ఎన్ఎంఈఓఎస్ స్కీం ద్వారా ఉచితంగా రైతులకు పంపిణీ చేశారు. ఒక్కొక్క రైతుకు 90 కిలోలు పంపిణీ చేశారు. ఈ పంపిణీ కార్యక్రమంలో పిఏసిఎస్ సంఘ సీఈఓ కొత్త రవీందర్ రావు, మండల విస్తీర్ణ అధికారిణి మంజుల, ఎఫ్‌పిఓ సంఘ సభ్యులు, సంఘం సిబ్బంది పాల్గొన్నారు.

## గంజాయి పట్టివేత : కేసు నమోదు



గంజాయి విక్రయిస్తున్న వారి నుంచి గంజాయిని స్వాధీనం చేసుకున్న పోలీసులు

**బాలానగర్, అక్టోబరు7 ప్రభాతవార్త:** బాలానగర్ మండల పరిధిలో గుండెడు నుండి ఉడిత్యాల వెళ్లే దారిలో గల కిరాణా షాపులో అక్రమంగా గంజాయి విక్రయిస్తున్నట్లు విశ్వసనీయ సమాచార మేరకు జడ్చర్ల ఎక్సైజ్ ఎస్సై నాగరాజు, వారి సిబ్బంది ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం తనిఖీలు నిర్వహించగా గంజాయి పట్టుబడిందని ఎక్సైజ్ సీఐ విప్లవ రెడ్డి తెలిపారు. గంజాయి విక్రయిస్తున్న వి.కిషన్, నేనావత్ కృష్ణ, నేనావత్ లాలీల వద్దనుండి 1.2 కేజీల గంజాయి, ఒక ద్విచక్ర వాహనం రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. హైదరాబాదు నుంచి ఒక కేజీ డ్రై గంజాయిని రూ. 15 వేలకు తీసుకువచ్చి, 6 గ్రాముల ప్యాకెట్లుగా తయారుచేసి రూ.400లకు చుట్టుపక్కల కంపెనీలలో పనిచేసే కార్మికులకు విక్రయిస్తున్నట్లు విచారణలో తేలిందని, ముగ్గురు నిందితులపై కేసు నమోదు చేసి అరెస్టు చేసామన్నారు. జడ్చర్ల ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఎవరైనా గంజాయి క్రయ విక్రయాలు జరిపినట్లైతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ఎక్సైజ్ సీఐ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై నాగరాజు తో పాటు సిబ్బంది సిద్ధార్థ, స్నేహలత, సునీత పాల్గొన్నారు.

## జడ్చర్లలో ఐటీ సోదాలు..?

**- ఒక్కొరికీ రూ.కోట్లలో జరిమానా - కలకలం రేపిన ప్రకటన**

**జడ్చర్ల, అక్టోబరు7,ప్రభాతవార్త:** జడ్చర్ల పట్టణంలో ఐటి అధికారుల నోటీసుల జారి కలకలం రేపింది. మంగళవారం రెండు తెలుగు రాష్ట్రాల్లో ఐటీ అధికారుల పలు కంపెనీల్లో పలు వ్యాపార సముదాయాల్లో సోదాలు చేస్తుండగా హైదరాబాద్‌లో ప్రముఖంగా సోదాలు వార్త కలకలం రేపింది. ఈక్రమంలో జడ్చర్ల మున్సిపాలిటీలో మాత్రం ఐటీ అధికారులు సుమారు 15 మంది వ్యాపారస్తులకు రూ.100 కోట్లకు పైగా ఫైన్ విధిస్తూ నోటీసులు జారీ చేశారని సోషల్ మీడియాలో వార్తలు రావడం చర్యనీయాంశమైంది. అందులో కొందరికి ఒక్కొక్కరికి రూ.5, 9, 11, 15 కోట్ల వరకు ఫైన్ విధించినట్లు సమాచారం. ఇదీ కాక ఈ వ్యాపారులు అంతా మున్సిపాలిటీలో నిత్యం కోట్ల రూపాయల జీరో బిజినెస్ చేస్తున్నట్లు అధికారులు గుర్తించినట్లు తెలిసింది. ఈ క్రమంలోనే ఐటి అధికారులు భారీ మొత్తంలో ఫైన్ విధిస్తూ నోటీసులు జారీ చేశారని పట్టణంలో ప్రజలు చర్చించుకుంటున్నారు. ఏది ఏమైనా ఐటి అధికారులు జడ్చర్ల పట్టణంలోని వ్యాపారులకు 100 కోట్లకు పైగా ఫైన్ విధిస్తున్నట్టు వార్తలు షికారు చేశాయి. అయితే నోటీసులు కూడా జారీ చేయడంతో జడ్చర్ల పట్టణంలో ఏ స్థాయిలో జీరో నడుస్తుందో ఇట్టే తెలిసిపోతున్నది. ప్రభుత్వ ఆదాయానికి వ్యాపారులుఏస్థాయిలో గండి కొడుతున్నారు. అర్థంచేసుకోవచ్చని పలువురు చర్చించుకుంటున్నారు. ఐటి అధికారుల నోటీసుల జారిపై ఇంకా పూర్తి సమాచారం తెలియరాలేదు.

## పునరావాసం పనులు వేగవంతం చేయాలి

మొదటి పేజీ తరువాయి భాగం..

వ్యవసాయ క్షేత్రంలోఇండ్లు కోల్పోయిన నిర్వాసిత కుటుంబాలకు, అవార్డు అందుకున్న వారందరికి పునరావాసం కింద మూడు వందల గజాల స్థలం, వారి అవసరాలకు ప్రైమరీ హెల్త్ సెంటర్, ఇంటిగ్రేటెడ్ పాఠశాల, అంగన్వాడి కేంద్రాలు, వెటర్నరీ హాస్పిటల్, కమ్యూనిటీ హాల్స్, గ్రామ పంచాయతీ భవనం, పార్కులను, రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్, ఓవర్ హెడ్ ట్యాంక్, మిషన్ భగీరథ పైపులు వంటి మౌలిక సదుపాయాలు త్వరితగతిన పూర్తయ్యేలా పనులను చేపట్టాలని సంబంధిత అధికారులనుఆదేశించారు. నిర్వాసితులకు కేటాయించే స్థలాలనుఅన్ని రకాల పనులను వేగవంతంగా పూర్తి చేసి నవంబర్ చివరి వరకు నిర్వాసితులకు ప్లాట్లను కేటాయించే విధంగా పనులన్నింటినీ పూర్తి చేయాలని కలెక్టర్ అన్నారు. ఎక్కడ ఎటువంటి ఇబ్బందులు లేకుండా, ఎప్పటికప్పుడు పరిశీలించి సమస్యలను వెంటనే పరిష్కరించి పనులను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ మధుసూదన్ నాయక్, ఆర్డీవో నవీన్, ఇరిగేషన్, మిషన్ భగీరథ, సర్వే లాండ్ రికార్డు, విద్యుత్, పంచాయతీరాజ్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## అర్హత లేని వైద్యులపై చర్యలు తీసుకోవాలి

- బాలుడు వరుణ్‌తేజ్ కుటుంబానికి న్యాయం చేయాలి
- ఎన్‌హెచ్‌ఆర్‌సీలో న్యాయవాది ఫిర్యాదు

**జడ్చర్ల, అక్టోబరు7,ప్రభాతవార్త:** జడ్చర్ల మండలంలోని కుర్వపల్లి గ్రామానికి చెందిన వరుణ్ తేజ ఆర్ఎంపీ డాక్టర్ ఇచ్చిన ఇంజక్షన్ వికటించి మృతి చెందడం పై యువ న్యాయవాది పెద్దింటి రవీంద్రనాథ్ తీవ్రంగా పరిగణిస్తూఈ ఘటనపై జాతీయ బాలల హక్కుల సంఘం మానవ హక్కుల సంఘం లో ఫిర్యాదు చేశారు. సరైన సర్టిఫికెట్స్ వైద్య పరిజ్ఞానం లేకుండా ఆర్ఎంపీలు డాక్టర్ల పేరుతో గ్రామాల్లో అమాయక ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని వారిపై తక్షణమే ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. దీంతో గ్రామాల్లో వైద్యం నిర్వహిస్తున్న వారికి సరైన లైసెన్స్ ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని, నియమ, నిబంధనలను పకడ్బందీగా అమలయ్యేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆర్ఎంపీ శ్రీశైలం నిర్లక్ష్యానికి ప్రాణాలు కోల్పోయిన వరుణ్‌తేజ్ కుటుంబాన్ని ఆదుకోవాలని నష్టపరిహారం చెల్లించాలని కోరారు.

## వెండి దొంగ దొరికాడు.. ఆభరణాలు, నగదు రికవరీ

### వివరాలు వెల్లడించిన ఎస్పీ జానకి

**మహబూబ్‌నగర్ క్రైమ్ , అక్టోబర్ 7 ప్రభాతవార్త:** వెండి దొంగతనానికి పాల్పడిన వ్యక్తిని గుర్తించి నగదు తో పాటు కొంత ఆభరణాలు స్వాధీనం చేసినట్లు మహబూబ్నగర్ ఎస్పీ జానకి తెలిపారు. మహబూబ్నగర్ జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె వివరాలు వెల్లడించారు. మాచినపల్లి కి చెందిఎ. రాజేశ్వర్ రెడ్డి ప్రస్తుతం బాలాజీ నగర్, మహబూబ్‌నగర్ లో నివాసం ఉంటున్నాడు. గత నెల 27న కుటుంబ సమేతంగా తిరుపతికి వెళ్ళగా, 28న రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు వారి ఇంటి తలుపులు పగులగొట్టి దొంగతనం చేశారు. 29న ఉదయం ఇంటి పనిమనిషి ఈ విషయం గమనించి కుటుంబ సభ్యులకు తెలపడంతో తదుపరి ఇంటిని పరిశీలించగా 4 కిలోల వెండి ఆభరణాలు (రూ.3,20,000/ విలువ) మరియు రూ.20,000/ నగదు దొంగతనం చేయబడినట్లు ఇచ్చారు. ఫిర్యాదు మేరకు మొదటి పట్టణ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ యం. అప్పయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం 6.30 గంటలకు ట్యాంక్ బండ్, రామయ్య బౌలీ వద్ద ఒక కార్ అనుమానాస్పదంగా నిలిచివున్నట్లు సమాచారం అందడంతో, ఇన్‌స్పెక్టర్ అప్పయ్య ఆదేశాల మేరకు ఎస్ఐ సీనయ్య సిబ్బందితో అక్కడికి చేరుకొని కార్ తనిఖీ చేయగా, కార్‌లో ఉన్న వ్యక్తి పారిపోవడానికి ప్రయత్నించాడు. పోలీసులు వెంటాడి పట్టుకొని విచారించగా, అతడు యండి. మహబూబ్ పాషా గా గుర్తించారు. విచారణలో నిందితుడు గత కొంతకాలంగా మహబూబ్‌నగర్ పట్టణం మరియు పరిసర ప్రాంతాల్లో రాత్రివేళ తాళాలు పగులగొట్టి దొంగతనాలు చేస్తున్నట్లు అంగీకరించాడు. నిందితుడి వద్ద నుండి బంగారు ఆభరణాలు: 43 గ్రాములు, వెండి వస్తువులు: 7 కిలోలు, నగదు రూ. 26,660/ఒక కారుమొబైల్ ఫోన్‌స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు యండి. మహబూబ్ పాషాను అదుపులోకి తీసుకొని, న్యాయపరమైన చర్యలు తీసుకుంటున్నారు. కేసు దర్యాప్తులో కృషి చేసిన సిసిఎస్ ఇన్స్పెక్టర్ రత్నంఫింగర్ ప్రింట్స్ ఇన్స్పెక్టర్ రాజేంద్రప్రసాద్, వన్ టౌన్ సబ్ ఇన్స్పెక్టర్ సీనయ్య, రూరల్ సబ్ ఇన్స్పెక్టర్ చంద్రమోహన్, సిసిఎస్ సబ్ ఇన్స్పెక్టర్ రమేష్, వన్ టౌన్ ఏఎస్ఐ శ్రీనివాసులు, టూ టౌన్ హెడ్ కానిస్టేబుల్ శేఖర్, రూరల్ పోలీస్ స్టేషన్ పిసి పవన్ కుమార్ గౌడ్ఐటీ సెల్‌లో పని చేస్తున్న ప్రవీణ్ కుమార్ లను ఎస్పీ డి. జానకి అభినందిస్తూ ప్రశంసా పత్రాలు అందజేశారు. మహబూబ్‌నగర్ పట్టణంలో దొంగతనాల నియంత్రణ కోసం పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ప్రజలు తమ ఇళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం, భద్రతా తాళాలు వాడడం, అపరిచితులను గమనించి వెంటనే పోలీసులకు సమాచారమివ్వడం వంటిజాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలి. నేరాల నిరోధంలో ప్రజల సహకారం పోలీసులకు అమూల్యమైందని ఎస్పీ తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న మహబూబ్‌నగర్ ఎస్పీ జానకి

# ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి

**భూత్పూర్, అక్టోబర్7, ప్రభాతవార్త:** క్రీస్తు పూర్వం నాలుగు వందల ఏళ్ల క్రితం భరత భూమిలో బోయ సామాజిక వర్గంలో జన్మించిన మహర్షి వాల్మీకిజయంతిని భూత్పూర్ మండలంలో పలు గ్రామాల్లో బోయ సామాజిక వర్గం సభ్యులు,పలు పార్టీల నాయకులు మంగళవారంఘనంగా నిర్వహించారు. భూత్పూర్ మండలం కప్పెట,తాటికొండ గ్రామాల్లో వాల్మీకి జయంతి వేడుకలు జరిగాయి. కప్పెట గ్రామంలో ఇక్కడి బోయలు నిర్మించిన వాల్మీకి గుడి వద్ద గ్రామానికి చెందిన బోయలతో పాటు భూత్పూర్ సింగిల్ విండో ఛైర్మన్ కదిరే శేఖర్‌రెడ్డి,బీఆర్ఎస్ నాయకులు సత్తూర్ బస్వరాజ్‌గౌడ్,టిమురళిధర్‌గౌడ్, సత్తూర్ నారాయణగౌడ్, మనమోని సత్యనారాయణ,తూము శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహగౌడ్, నరేష్‌గౌడ్,మూస సాయిలు,సత్తూర్ అశోక్‌గౌడ్ పాల్గొన్నారు.

**కాంగ్రెస్ ఆధ్వర్యంలో:** మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో భూత్పూర్ మండలం కప్పెట గ్రామంలో వాల్మీకి జయంతిని మంగళవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు,స్థానిక బోయ సామాజిక వర్గ నాయకులు,సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు నర్సింహ్మారెడ్డి, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రేకులపాటి భూపతిరెడ్డి,వెంకటేశ్వర్‌రెడ్డి,మాసగౌడ్,కిట్టురెడ్డి,వడ్డె శ్రీనివాసులు, జగదీష్‌రెడి హరియా నాయక్, తమన్నగౌడ్, సంజీవరెడ్డి, కొండయ్య,రఘుపతిరెడ్డి, రాజేందర్‌గౌడ్,దెంది లక్ష్మీకాంత్‌రెడ్డి మొగులయ్య,సాగర్, మధు తదితరులు పాల్గొన్నారు.

**తాటికొండలో:** భూత్పూర్ మండలం తాటికొండ గ్రామంలో మహర్షి వాల్మీకి జయంతిని యువకులు,గ్రామస్తులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు సుదర్శన్, ఎర్రవాపు నర్సింహులు,నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

**లింగాలలో:** మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. వాల్మీకి జయంతి సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాలవాల్మీకి సోదరులు జయంతి వేడుకల్లో పాల్గొని ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వాల్మీకి మహర్షి చిత్ర పటానికి పూజలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించిన వావానంలో ఊరేగింపుగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి మహర్షి సంఘం మండలాధ్యక్షులు గుజ్జుల బక్కయ్య మాట్లాడుతూ రామాయణాన్ని మహాద్భుత కావ్యంగా మలిచి జాతికి సన్మార్గాన్ని నిర్దేశించిన మహోన్నత వ్యక్తి వాల్మీకి మహర్షి అన్నారు. అనంతరం వాల్మీకి సోదరులకు గణపతి ఆధ్వర్యంలో అన్నదానంఏర్పాటు చేశారు. ఉపాధ్యకులు శేషయ్య, ప్రధాన కార్యదర్శి కొంకలపల్లి శంకర్, ప్రధాన కోశాధికారి కృష్ణ, జనరల్ సెక్రటరీ మండ్లశంకర్,వాల్మీకి సోదరులు చక్రవర్తి, సుగ్రీవ, మినిగ మల్లేష్, శ్రీను,శివ, ఉపేందర్, కొంకల్లపల్లి శ్రీను, రవీందర్, శ్రీశైలం, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

**ఊట్కూర్, అక్టోబరు7 ప్రభాతవార్త:** ఊట్కూర్ మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలను గ్రామ ప్రజలు ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి, హారతులు ఇచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి మహర్షి జీవిత చరిత్రను స్మరించుకుంటూ ఆయన బోధించిన సద్గుణాలను గుర్తుచేశారు. తరువాత విద్యా రంగంలో ప్రతిభ కనబరిచి యంబిబిఎస్ సీట్లు సాధించిన విద్యార్థులు నక్కరమాదేవి (తండ్రి నక్క రాజు), యన్.మహేష్ (తండ్రి రామాంజనేయులు)లను గ్రామ పెద్దలు ఘనంగా సన్మానించారు. వారి విజయంపై గ్రామ ప్రజలు అభినందనలు తెలిపారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

**గద్వాల టౌన్ అక్టోబర్7, ప్రభాతవార్త:** గద్వాల నియోజకవర్గం కె.టిదొడ్డి మండల కేంద్రము, నందిన్నె గ్రామంలో జరిగిన వాల్మీకి మహర్షి జయంతి వేడుకలకు ముఖ్యతిదులుగా ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ హాజరై వాల్మీకి విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళ్ళు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ...ఆదికవి వాల్మీకి మహర్షి రామాయణం రచించి సీతారాముల గురించి ప్రపంచానికి తెలియజేశారాని సూచించారు. నియోజకవర్గంలో పలు గ్రామాలలో పండగ వాతావరణం నెలకొన్నదని, పలు గ్రామాల్లో వాల్మీకి విగ్రహాలను ఏర్పాటు చేసుకోవడం పై సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, వాల్మీకి సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు

**ఇటిక్యాలలో:** నేటితరం ఆదర్శనీయుడు వాల్మీకి మహర్షి రామాయణ సృష్టికర్త నేటి సమాజానికి ఆదర్శనీయుడని ఆయన జీవిత చరిత్ర అందరికీ ఆదర్శంగా నిలుస్తుందని మండల వాల్మీకి నాయకుడు తిమ్మాపురం నారాయణ నాయుడు గుర్తు చేశారు. మంగళవారం వాల్మీకిమహర్షి జయంతిని పురస్కరించుకొని మండల పరిధిలోని తిమ్మాపురం. కొండేరు. కోదండపురం .సాతర్ల. షాబాద్. ఉదండాపురం గ్రామాలలో వాల్మీకి మహర్షి విగ్రహాలకు చిత్రపటాలకుపూలమాలలు వేసినివాళులర్పించారు. ఈ సందర్భంగా షాబాద్ గ్రామంలో నూతన వాల్మీకి విగ్రహ ఏర్పాటుకు నారాయణ నాయుడు దాతగా ముందుకొచ్చారు. ఈ సందర్భంగా షాబాద్ గ్రామంలో వాల్మీకి మహర్షి చిత్రపటానికి వాల్మీకి నాయకులు గ్రామ పెద్దలతోకలిసి నివాళులర్పించారు. అదేవిధంగా మండల పరిధిలోని పలు గ్రామాలలో వాల్మీకి సంఘం నాయకుల కలసి వాల్మీకి మహర్షి జయంతి సందర్భంగా ఘనంగా నివాళులర్పించారు.

**ఆత్మకూర్ అక్టోబర్7, ప్రభాతవార్త:** వాల్మీకి మహర్షి రామాయణాన్ని రచించి భారతదేశానికి ఆదర్శ పాలకుడి జీవిత చరిత్రను పరిచయం చేసిన వాల్మీకి మహర్షి ఆశయ స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ పని చేయాలని బిజెపి, టిఆర్ఎస్ పార్టీలకు చెందిన నాయకులతో పాటు పలువురు విజ్ఞప్తి చేశారు. ఆత్మకూరు మండలంలోని రేచింతల గ్రామంలో వాల్మీకి మహర్షి జయంతిని పురస్కరించుకొని నూతనంగా ఏర్పాటు చేసినటువంటి వాల్మీకి మహర్షి విగ్రహాన్ని ఆవిష్కరించారు. గ్రామంలోని దేవాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసినటువంటి వాల్మీకి మహర్షి విగ్రహాన్ని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కంబాలపురం రాము వాల్మీకి యువసేన రాష్ట్ర కో కన్వీనర్ మండల రామకృష్ణ తదితరులు విగ్రహాన్ని ఆవిష్కరించి ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాల్మీకి మహర్షి జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం వాల్మీకుల గర్వకారణంగా వారు పేర్కొన్నారు అంతే కాకుండా వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చి రాజకీయంగా అభివృద్ధి జరిగే వరకు వాల్మీకులు నిరంతరం ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చేందుకు తమ వంతు ప్రయత్నాలు కొనసాగించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమానికి రేచింతల గ్రామ వాల్మీకి సంఘం నాయకులు అధ్యక్షత వహించగా మాజీ ఎంపీటీసీ సభ్యులు అలివేల బిసన్న, మాజీ సర్పంచ్ రాఘవేందర్, కాంగ్రెస్ మాజీ జెడ్పిటిసి సభ్యులు బాలకృష్ణ,పలు పార్టీలకు చెందిన నాయకులూ కార్యకర్తలతో పాటుగా వాల్మీకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. దీంతోపాటుగా వాల్మీకి మహర్షి జయంతి ఉత్సవాన్ని పురస్కరించుకొని మున్సిపల్‌కేంద్రమైన ఆత్మకూరు పట్టణంతోపాటుగా మండలంలోని వివిధ గ్రామాలలో వాల్మీకి సోదరులు వాల్మీకి మహర్షి జయంతిని ఘనంగా జరుపుకున్నారు.



వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం



కప్పెటలో వాల్మీకి గుడివద్ద జయంతి వేడుకలు నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు













వాల్మీకి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

## శోభాయమానంగా శ్రీవాల్మీకి పవిత్ర జలాల శోభయాత్ర

### వాల్మీకి మహర్షి విగ్రహానికి జలాభిషేకం

**మహబూబ్‌నగర్ (చిన్నచింతకుంట) అక్టోబరు 7 ప్రభాతవార్త :** రామాయణ మహాకావ్య రచయిత శ్రీవాల్మీకి మహర్షి జయంతి ఉత్సవాలు మండల కేంద్రంలోని శ్రీవాల్మీకి దేవాలయంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. సోమవారం గణపతి పూజ, పుణ్య వాచకం, అఖండ భజనలు నిర్వహించారు. మంగళవారం ఆత్మకూరు మండలంలోని జూరాల గ్రామ సమీపంలోని కృష్ణానది పవిత్ర జలాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి, ట్రాక్టర్ వాహనంలో పవిత్ర జలాలను గ్రామ సమీపంలోకి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా వాల్మీకి బోయ కులస్తులు మహిళలు బ్యాండ్ మేళాలు, మంగళ హారతులతో పవిత్ర జలాలను స్వాగతం పలికి పురవీధుల గుండా శోభాయాత్ర శోభాయ మానంగా జరిగింది. వాల్మీకి కులస్తులు అడుగడుగునా అడుగుల భజనలు, బొడ్డెమ్మలు, యువతి, యువకుల కోలాటాలతో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.





పవిత్ర జలాలను తీసుకొస్తున్న వాల్మీకి యువత



పవిత్ర జలాలకు మంగళ హారతులతో స్వాగతం పలుకుతున్న మహిళలు

పవిత్ర జలాలను వాల్మీకి దేవాలయం వద్దకు చేర్చి వాల్మీకి మహర్షి విగ్రహానికి అర్చకులు పంచామృత, జలాభిషేకం నిర్వహించి, అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో వాల్మీకి సేవా సంఘం,యువజన సంఘం సభ్యులు, పెద్దఎత్తున మహిళలు యువకులు పాల్గొన్నారు. మండలంలోని ఆయా గ్రామాలలో శ్రీ వాల్మీకి జయంతి ఉత్సవాలను వాల్మీకి బోయ కులస్తులు అత్యంత వైభవంగా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం శ్రీ వాల్మీకి జయంతిని అధికారికంగా నిర్వహించాలని జీవో జారీ చేయడంతో మండల తహసిల్దార్‌కార్యాలయంలో శ్రీవాల్మీకిజయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి వాల్మీకి జీవితం నేటి యువతకు ఆచరణీయమని ఆయన రాసిన రామాయణ కావ్యం నేటి జీవన విలువలకుఅనుగుణంగా ఉందనితహసిల్దార్ ఎల్లన్న తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూఅధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా సామూహిక కుంకుమార్చన పూజలు

**ఊట్కూర్, అక్టోబరు7 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని భవాని మందిరంలో మంగళవారం భవాని మాతకు ఘనమైన సామూహిక కుంకుమార్చన పూజలు నిర్వహించబడ్డాయి. భక్తులు పెద్ద సంఖ్యలో చేరి అమ్మవారి దర్శనం పొందగా, ఆలయంలో ప్రత్యేక అలంకారాలు, వెలకట్టుగా అమర్చిన చీరలతో పూజ మరింత విశిష్టంగా ఆహ్లాదకరంగా సాగింది. పురోహితులు సర్వోత్తమ్ చారి మహా నైవేద్యం, మహా మంగళహారతి నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం కూడా ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమాన్ని సోమవంశ సహస్రార్జున క్షత్రియ సమాజం అధ్యక్షులు అశోక్ కుమార్ చౌదరి, రమీలా బాయి, మహిళా మండలి అధ్యక్షులు రాధా చంద్రప్రకాష్ చౌదరి ఆధ్వర్యంలో చేపట్టారు. అమ్మవారికి ఇత్తడి ప్రభను చౌదరి గౌరీశంకర్ సమర్పించగా, భక్తులు క్యూలైన్‌లో దర్శనం చేసుకోవడానికి అవసరమైన స్టీల్ కాటంజం చౌదరి గురునాథ్ (సాఫ్ట్‌వేర్ ఇంజనీర్)ఇద్దరు అన్నదమ్ములు అందజేశారు. భీష్మరాజ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డా. రాజ్ కుమార్ రెడ్డి అమ్మవారిని దర్శించుకుని



డాక్టర్ రాజ్‌కుమార్ రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

తీర్థప్రసాదం స్వీకరించారు. సాయంత్రం అమ్మవారికి అలంకరించిన చీరల వేలం కార్యక్రమం నిర్వహించగా, భక్తులు ఉత్సాహంగా పాల్గొని చీరలను సొంతం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్‌కె. సమాజ్ ఉపాధ్యక్షులు సుభాష్, కోశాధికారి చౌదరి గోవిందరావు, సభ్యులు గౌరీశంకర్, మేంగ్జి వసంత్‌రావు, రంగాపూర్ వెంకట్రావు, వినాయక్‌రావు, యశ్వంత్‌రావు, గోపాల్‌రావు, లక్ష్మణ్‌రావు, తుకారం తదితరులు, మహిళా భక్తులు, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## వాహనాల్లో పరిమితికి మించి కూలీలను తరలిస్తే కఠిన చర్యలు

**లింగాల, అక్టోబరు7 ప్రభాతవార్త:** పొలం పనుల కోసం పత్తి తీయడానికి కూలీలను పరిమితికి మించి వావానాల్లో తరలిస్తే అట్టి వాహన యాజమానిపై డ్రైవర్లపై కేసులు నమోదు చేస్తామని ఎస్సై వెంకటేశ్వర్లు గౌడ్ తెలిపారు. మంగళవారం మండలంలోని వివిధ ప్రాంతాల్లో వాహనాలను ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. దసరా సెలవులు ముగిసిన తర్వాత విద్యార్థులు పాఠశాలకు వెళ్ళకుండా పత్తి చేను తీయడానికి తీసుకెళితే వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ముఖ్యంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఉదయం సమయంలో వాహనాలను ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను కూలీ పనులకు తీసుకెళితే తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇవ్వడం జరుగుతుందని అన్నారు. చదువుకునే విద్యార్థులను పాఠశాలకు వెళ్ళకుండా పత్తి చేను



కూలీలను పరిమితికి మించి తీసుకెళ్ళి కూడదని సూచిస్తున్న ఎస్సై వెంకటేశ్వర్లు గౌడ్, సిబ్బంది

తీయడానికి ఆటోల్లో, ఇతర వాహనాల్లో తీసుకెళితే వారిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరు పరచడం జరుగుతుందని హెచ్చరించారు.

## గంజాయి ముఠా వివరాలు వెల్లడించిన డీఎస్పీ

మొదటి పేజీ తరువాయి భాగం..

పెట్టారు. అదే క్రమంలో 5వ తారీఖు రోజు మల్లేష్ ప్రభు, ఇద్దరూ కలిసి ఒడిశాకు వెళ్లి అక్కడనాగలూరు గ్రామం, కలిమెల, మాల్కంగిరి జిల్లాలో మోహన్, అర్జున్ వద్ద నుండి 4 కేజీల గంజాయి రూ. 2,500/ చొప్పున కొనుగోలు చేశారు. దిలీప్ కాలె కొంత పని ఉందని చెప్పి, ఆ గంజాయి ప్యాకెట్లను మల్లేష్ ప్రభు వద్ద ఉంచి, బెంగళూర్ కి తీసుకెళ్ళమని చెప్పడంతో సోమవారం మల్లేష్ ప్రభు ఆ గంజాయిప్యాకెట్లను తన బ్యాగ్‌లో వేసుకొని, ఎవరికి అనుమానం రాకుండా ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తు ఒకే బస్సులో వెళితే అనుమానం వస్తుందని బస్సులు మారుతూ బెంగళూరు వెళుతుండగా పెబ్బేరు బస్ స్టాండ్‌లో హైదరాబాద్ నుంచి బస్సులో వచ్చి పెబ్బేరు బస్టాండ్‌లో దిగి కర్నూల్ వరకు ఇంకో బస్సు ఎక్కడానికి ఎదురుచూస్తుండగా అప్పటికే సమాచారం అందుకున్న పెబ్బేరు పోలీసులు వెళ్ళి అతన్ని అదుపులోకి తీసుకున్నారు. జిల్లా ఎస్పీ రావుల గిరిధర్, వనపర్తి పర్యవేక్షణలో, డిఎస్‌పి వెంకటేశ్వర్ రావు సూచనలతో కొత్తకోట సిఐ రాంబాబు ఆధ్వర్యంలో దర్యాప్తులో భాగంగా నేరస్తున్ని అరెస్టు చేసి కోర్ట్‌లో హాజరు పరచడం జరుగుతుంది. నిందితులకు క్రైమ్ నెంబర్ 222/2025 కేసు నమోదు చేసి కోటలో హాజరుపరచామని నిందితుల వద్ద ఉన్న నాలుగు కేజీల గంజాయి, వాటి విలువదాదాపు రెండు లక్షల వరకు ఉంటుందనితెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిఎస్పి వెంకటేశ్వర్లు, సిఐ రాంబాబు, ఎస్ఐ యుగంధర్‌రెడ్డి, ఎస్సై దివ్యరెడ్డి, కానిస్టేబుల్, సిబ్బంది పాల్గొన్నారు.

## రైతులకు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

మొదటి పేజీ తరువాయి భాగం..

రూ.500 బోనస్ ఇవ్వడం జరుగుతుందన్నారు. అలాగే మామూలు బియ్యానికి క్వింటాలకు మద్దతు ధర రూ. 2,369/ ఇస్తుండడంతో ఈ సీజన్లో జిల్లాలో2.97 లక్షల టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యంగా నిర్దేశించినట్లు పేర్కొన్నారు. సంబంధిత ఉన్నతాధికారులు తరచూ కొనుగోలు కేంద్రాల వద్దకు వెళ్లి తనిఖీలు చేయాలని, ధాన్యం కొనుగోలు విషయంలో నిబంధనలు ఉల్లంఘించే కేంద్రాల ఇన్చార్జిలపై తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ, జిల్లా పౌర సరఫరాల అధికారి స్వామి కుమార్, మేనేజర్ విమల, కోఆపరేటివ్ అధికారి శ్రీనివాస్, మార్కెటింగ్ అధికారిని పుష్పమ్మ, డిఆర్డిఏ ఏపీడి శ్రీనివాస్, శిక్షకులు, తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు మాజీ మంత్రి లక్ష్మారెడ్డి పరామర్శ

**మహబూబ్‌నగర్, అక్టోబరు7 ప్రభాతవార్త:** జడ్చర్ల నియోజకవర్గానికి చెందిన దేవుల నాయక్, శంకర్‌లు గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో మహబూబ్‌నగర్ పట్టణంలోని వేర్వేరు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఈ మేరకు వారిని మాజీ మంత్రి బిఆర్ఎస్ మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు డా.సి.లక్ష్మారెడ్డి పరామర్శించారు. వైద్యుల ద్వారా వారి ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. అధైర్య పడవద్దని మనోధైర్యం నింపారు. ఆయన వెంట బిఆర్ఎస్ నాయకులు కొడుగల్ యాదయ్య, ఇమ్ము, శంకర్ నాయక్, అంజి, టైగర్ నరసింహ తదితరులు ఉన్నారు.

